ప్రజాశక్తి
మంగళవారం 2 సెప్టెంబర్ 2025 5 అనంతపురం

గోకులం షెడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

# సమగ్ర గ్రామీణాభివృద్ధికి చర్యలు

## కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

సమగ్రంగా గ్రామీణాభివృద్ధికి అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలియజేశారు. అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామంలో 2.30 లక్షల రూపాయలతో నిర్మించిన గోకులం షెడ్‌ను సోమవారం ప్రారంభించారు. షెడ్ నిర్మాణానికి సంబంధించిన వివరాలను లబ్ధిదారురాలు సావిత్రితో అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే కంపోస్ట్ పిట్‌కు భూమి పూజ చేశారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలు నాటారు. ఎండోమెంట్ భూమిని పరిశీలించి అక్కడ నీరు నింపేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విలేజ్ హెల్త్ క్లీనిక్, రైతు సేవా కేంద్రం వద్ద ఉపాధి హామీ కింద రూ.35 వేలతో నిర్మించిన పశువుల నీటి తొట్టెను ప్రారంభించారు. రూ.75 వేలతో ఏర్పాటు చేసిన రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను పరిశీలించారు.

**ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ**

చియ్యేడు గ్రామంలో లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి కలెక్టర్ వినోద్‌కుమార్ పింఛన్లను పంపిణీ చేశారు. ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తున్నారా.. లేదా.? అని లబ్ధిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి టి.గంగాధర్ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ శైలజ, డిపిఒ నాగరాజు నాయుడు, జెడ్పీ సీఈవో శివశంకర్, డ్వామా పీడీ సలీం బాషా, తహశీల్దార్ మోహన్ కుమార్, ఎంపిడిఒ దివాకర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు ఇంకా జరగాల్సి ఉన్న కార్బన్ హార్మోన్ సిటీ

మిలీనియం టవర్స్ పేరుతో ఏర్పాటు చేస్తున్న నూతన ప్రాజెక్టు

# ప్రచారమెక్కువ...వసతులు తక్కువ..!

- హార్మోన్ సిటీలో స్థల యజమానులకు తిప్పలు
- ఏళ్లుగా మౌలిక సదుపాయల కోసం ఎదురుచూపు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ప్రచారమెక్కువ... పని తక్కువ అన్న చందంగా తయారయింది కార్బన్ హార్మోన్ సిటి సనిటీరు. ఇక్కడ నివాస స్థలాలు కొన్న యజమానులు ఏళ్లుగా మౌలిక సదుపాయల కోసం ఎదురుచూపులు చూసే పరిస్థితి నెలకొంది. ప్రాజెక్టు గడువు ముగిసి రెండేళ్లు పూర్తయినా ఇంకా స్థల యజమానులకు మౌలిక సదుపాయలు కల్పించలేదు. దీంతో వారు లబోదిబో మంటూ యాజమన్యానికి గోడు వెళ్లబోసు కుంటూనే ఉన్నారు. అన్ని పనులూ పూర్తవుతాయని వాయిదాలు వేయడం తప్ప పనిలో పురోగతి మాత్రం కనిపించడం లేదు. ఎప్పటికి పూర్తి చేస్తారని కొంత మంది స్థల యాజమానులు ఆదివారం నాడు కార్యాలయం వద్దకెళ్లి సంస్థ యాజమాన్యాన్ని గట్టిగానే నిలదీసినట్లు సమాచారం. ఎప్పటిలాగానే త్వరలోనే పూర్తి చేస్తామని యాజమాన్యాం నుంచి సమాధానం వచ్చింది.

**గడువు ముగిసి రెండేళ్లు..!**

అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ పరిధిలో 78 ఎకరాల్లో జాతీయ ప్రమాణాలతో లేఅవుట్ వెంచర్ వేసి పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని కార్బన్ హార్మోన్ సిటి పేరుతో గోల్డన్ గ్లోబ్ సంస్థ ప్రచారం చేపట్టింది. మొత్తం 755 ప్లాట్లు వేసి అమ్ముతున్నట్లు ప్రకటించడమే కాకుండా ఈ మేరకు అనుమతులు పొందింది. ప్రాజెక్టు అనుమతులు ఎపి రేరా నుంచి పొందుతున్న సమయంలో రెండేళ్ల కాల వ్యవధిలో ప్రాజెక్టు పూర్తి చేస్తామని ప్రకటించింది. 2021 జులై 23వ తేదీన అనుతులు పొందింది. 2023 జులై 10వ తేదీలోపు ప్రాజెక్టును పూర్తిచేస్తామని చెప్పింది. ప్రచారంలో కార్బన్ హార్మోన్ సిటీ అని కార్పొరేట్ పేరు కనిపించేసరికి ధర ఎక్కువైనా చాలా మంది నివాస స్థలాన్ని ఈ ప్రాజెక్టులో కొనుగోలు చేశారు. కాని ఇప్పటికీ ముందు ప్రకటించిన విధంగా మౌలిక సదుపాయాల కల్పన జరగలేదు. దీంతో కొనుగోలు చేసిన వారు లబోదిబో మంటున్నారు.

**పూర్తవగానే మిలీనియం టవర్స్ పేరుతో మరో ప్రాజెక్టు**

మొదటి ప్రాజెక్టు పూర్తవకనే మిలీనియం టవర్స్ పేరుతో మరో ప్రాజెక్టును 2023లో చేపట్టింది. నాలుగు టవర్స్ నిర్మించి పూర్తి స్థాయి మౌలిక సదుపాయలు కల్పిస్తామని ప్రచారం నిర్వహించింది. ఈ ప్రాజెక్టు గడువు పూర్తవవడానికి 2029 వరకు సమయముంది. ఇప్పటి వరకు ఇక్కడ ముందు చెప్పిన విధంగా ఐటి పరిశ్రమలేవి వచ్చే పరిస్థితులు మాత్రం కనిపించలేదు. ఆ పేరుతో ప్లాట్ల అమ్మకాలు చేసి సొమ్ముచేసుకునే పనిలో సంస్థ ఉన్నట్టు విమర్శలొస్తున్నాయి. ప్రచారానికి తగ్గట్టు ఆచరణలో పని ముందుకు సాగడం లేదని కొనుగోలు చేసిన వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలున్నాయి. ఎపి రేరా నిబంధనల ప్రకారం జాప్యం జరిగితే సంబంధిత సంస్థపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవం

**అనంత, శైలజానాథ్‌ను కలిసిన స్టాండింగ్ కమిటీ సభ్యులు**

అభినందనలు తెలుపుతున్న అనంత, నరేష్‌రెడ్డి, శైలజానాథ్

**ప్రజాశక్తి-అనంతపురం**

అనంతపురం నగర పాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. సోమవారం నిర్వహించిన సమావేశంలో బి.లావణ్య, ఎం.దేవి, పి.రామాంజినమ్మ, కె.జయలలిత, జి.మల్లికార్జునలు ఎన్నికయ్యారు. కార్పొరేషన్‌లో స్టాండింగ్ కమిటీలోని ఐదు స్థానాలకు గత నెలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఐదుగురు మాత్రమే నామినేషన్లు వేయడంతో వారంతా ఏకగ్రీవమయ్యారు. నూతన సభ్యులు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి కతజ్ఞతలు తెలియజేశారు. స్టాండింగ్ కమిటీ సభ్యులను వైసీపీ అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్ అభినందించారు.

# పకడ్బందీగా ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు

**జిఎంఆర్ గ్రౌండ్ స్థలాన్ని పరిశీలించిన కూటమి నేతలు**

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా కూటమి నేతలు

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 10వ తేదీన అనంతపురం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను కూటమి నేతలు పరిశీలించారు. సోమవారం సాయంత్రం అనంతపురంలోని జిఎంఆర్ గ్రౌండ్‌లో స్థలాన్ని ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు సంయుక్తంగా పరిశీలించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, టిజి.భరత్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పరిటాల సునీత, గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణిశ్రీ, అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్.రాజు, కందికుంట వెంకటప్రసాద్ తదితరులు పరిశీలించి అక్కడి ఏర్పాట్లపై చర్చించారు. బహిరంగ సభ వేదిక, ప్రజలు కూర్చొనే సభాప్రాంగణం తదితర అన్నింటి గురించి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ అనంతపురంలో కూటమి మహాసభను 6వ తేదీన ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ తదితర సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రశ్నిస్తే కేసులు పెట్టేవారన్నారు. ఈ నెల 10వ తేదీన అనంతపురంలో నిర్వహించి 'సూపర్‌హిట్' సభను దాదాపు 3.50 లక్షల మందితో నిర్వహించబోతున్నామన్నారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు సభ ఉంటుందని తెలిపారు. ఇందులో ఉమ్మడి జిల్లా నాయకులే కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజా ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.

# వైసిపి విష ప్రచారాన్ని నమ్మొద్దు : కాలవ

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

**ప్రజాశక్తి-రాయదుర్గం**

లబ్ధిదారులైన అర్హుల పింఛన్లను కూటమి ప్రభుత్వం తొలగిస్తోందన్న వైసిపి విష ప్రచారాన్ని నమ్మొద్దని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. పట్టణంలోని ఉలిగమ్మ గుడి వద్ద సోమవారం ఆయన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలవ మాట్లాడుతూ పింఛన్ల విషయంలో అనేక ఫిర్యాదులు అందడంతో వాటిని పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత అర్హులందరి పింఛన్లను కొనసాగిస్తామన్నారు. అయితే ఈ విషయాన్ని వైసిపి కప్పిపెట్టి ప్రభుత్వం అర్హుల పింఛన్లను తొలగిస్తోందని దుష్ప్రచారం చేస్తుందని ధ్వజమెత్తారు. ఇలాంటి ప్రచారాన్ని అందరూ తిప్పి కొట్టాలని సూచించారు. ప్రభుత్వం వీలైనంత ఎక్కువ మందికి పింఛన్లు అందించేందుకు కృషి చేస్తుందని, కొత్తగా మరింత మంది అర్హులకు పింఛన్లు ఇవ్వాలన్నదే చంద్రబాబు లక్ష్యమన్నారు. పేదల పొట్ట కొట్టి ప్రభుత్వ సొమ్మును దోచేసిన వైసిపి అధినేత జగన్, ఆ పార్టీ నాయకులకు కూటమి ప్రభుత్వంపై మాట్లాడే అర్హత లేదన్నారు. ఐదేళ్ల పాలనలో పది లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించిన చరిత్ర ఆ పార్టీదని మండిపడ్డారు. అరాచక పాలన నుండి రాష్ట్రాన్ని చంద్రబాబు గట్టెక్కిస్తూ అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 30 ఏళ్లు పూర్తి చేసుకున్న చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, నాయకులు గౌరీ, పురుషోత్తం, పసుపులేటి నాగరాజు, గాజుల వెంకటేశులు, నాగరాజు, తిప్పేస్వామి, ధనార్జున, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక వ్యాపారంపై 'మోర్' దెబ్బ..!

- నార్పలలో మోర్ సూపర్ మార్కెట్
- ఆందోళనలో స్థానిక వ్యాపారులు

**ప్రజాశక్తి-నార్పల**

**ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితమైన షాపింగ్ మాల్స్ ఇప్పుడు మండల కేంద్రాలకు కూడా వ్యాపించాయి. దీంతో చిరువ్యాపారుల జీవితాలు బుగ్గి అవుతున్నాయి. కార్పొరేట్‌ల వ్యాపార ప్రకటనలు, వారు ఇస్తున్న ఆఫర్ల మోజులో పడి జనాలు కూడా మోర్ వంటి షాపింగ్ మాల్‌కు క్యూ కడుతున్నారు. దీంతో చిన్నా చితక వ్యాపారులు వ్యాపారాలు లేక విలవిలలాడుతున్నారు. ఈ పరిస్థితే ఇప్పుడు నార్పల వ్యాపారులకు వచ్చింది. ఇటీవల మండల కేంద్రంలో ప్రారంభమైన మోర్ షాపింగ్ మార్టుతో చిన్న చిన్న వాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపారాలు లేకపోవడంతో ఇప్పటికే కొన్ని దుకాణాలు మూతబడ్డాయి. మరి కొందరు సంక్షోభంలో కూరుకుపోతున్నారు.**

నార్పలలో ఉన్న మోర్ సూపర్ మాల్

అన్నిహంగులతో మండల కేంద్రంలో మోర్ షాపింగ్ మాల్ ప్రారంభమైంది. దీంతో స్థానిక కిరాణా, ఫ్యాన్సీ స్టోర్లు, కూరగాయలు, పండ్ల వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడో పెద్దపెద్ద పట్టణాలకు పరిమితమైన మాల్స్ ఇప్పుడు మండల కేంద్రాలకు కూడా పాకడంతో చిరువ్యాపారులు ఉపాధిని కోల్పోతున్నారు. ఎందుకంటే చిన్న చిన్న వ్యాపారాలు దెబ్బతిని రోడ్డున పడుతున్నారు. మండల కేంద్రంలో కూడా ఇదే పరిస్థితి దాపురించిందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటైన మోర్ షాపింగ్ మాల్‌లో రకరకాల ఆఫర్లు పెట్టి గ్రామీణ ప్రాంత ప్రజలను ఆకర్షిస్తున్నారు. దీంతో చిన్న చిన్న వ్యాపారులు, రోడ్లపై వ్యాపారాలు చేసే వారి పరిస్థితి దయనీయంగా మారింది. షాపింగ్ మాల్ పడ్డాక స్థానిక గూగూడు రోడ్డులో ఉన్న పలు దుకాణాలను ఎత్తివేశారు. మోర్ షాపింగ్ మాల్ ఆకర్షణీయమైన ఆఫర్లకు ఇంకా ఎన్ని దుకాణాలు మూతపడతాయోనని వ్యాపారులు చర్చించుకోవడం బాధాకరం. ఇప్పటికైనా స్థానిక వ్యాపారుల ఇబ్బందులను గుర్తించి ఇలాంటి కార్పొరేట్ దుకాణాలకు అనుమతులను రద్దు చేయాలని కోరుతున్నారు. అంతేగాకుండా తమకు జరుగుతున్న అన్యాయానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అండగా నిలవాలని వేడుకుంటున్నారు.

**తగ్గిన వ్యాపారాలు**

నార్పలలో మోర్ షాపింగ్ మాల్ ప్రారంభమైనప్పటి నుంచి కిరాణా దుకాణాల్లో పూర్తిగా వ్యాపారాలు తగ్గిపోయాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే దుకాణాలకు బాడుగలు కూడా కట్టుకోలేం. ఇప్పటికే కొన్ని దుకాణాలు మూతబడ్డాయి. ఇలాగే కొనసాగితే మరిన్ని దుకాణాలు మూతపడే అవకాశం ఉంది.

**మహేష్, కిరాణా వ్యాపారి.**

**అమ్ముడుపోక కుళ్లిపోతున్న పండ్లు**

మోర్ వ్యాపార సంస్థ ఏర్పాటు చేసినప్పటి నుంచి పండ్ల వ్యాపారం తగ్గిపోయింది. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి అనంతపురం నుంచి తెచ్చిన పండ్లు అమ్ముడుపోక బుట్టల్లోనే కుళ్లిపోతున్నాయి. మోర్‌లో ఫ్రిడ్జ్‌లో పెట్టి అమ్మకాలు చేస్తుండటంతో తమ వద్ద ఎవరూ కొనడం లేదు. దీంతో కుటుంబాల పోషణ భారంగా మారింది.

**లక్ష్మీదేవి, పండ్ల వ్యాపారులు.**

**మా వద్దకు ఎవరూ రావడం లేదు..**

మోర్ వ్యాపార సంస్థ ప్రారంభమైనప్పటి నుంచి తమ వద్ద పండ్లు ఎవరూ కొనడానికి రావడం లేదు. మండల ప్రాంతాలకు ఇలాంటి షాపులు రావడం మంచిది కాదు. మాల్ రావడం వల్ల రెక్కాడితేగాని డొక్కాడని మాలాంటి వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. ప్రభుత్వాలు స్పందించి ఆదుకోవాలి.

**చిట్టెమ్మ, అరటికాయల వ్యాపారి**

**మా కడుపు కొడుతున్న 'మార్కెట్'**

ఇటీవల నార్పలకు దాపురించిన మోర్ షాపింగ్ మాల్ మా కడుపు కొడుతోంది. ఇది ప్రారంభించి నప్పటి నుంచి వ్యాపారాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. గూగూడు రోడ్డులో చాలా దుకాణాలు ఇప్పటికే ఎత్తివేశారు. ఇలాంటి కార్పొరేట్ వ్యాపారాలను గ్రామస్థాయిలో ప్రోత్సహించి చిరు వ్యాపారుల కడుపు కొట్టొద్దు..

**పూసల వెంకటేష్, స్టీల్ సామాన్ల వ్యాపారి.**

## రేపు మెగా జాబ్‌మేళా

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 3వ తేదీ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్న ట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వి.నరసింహారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ 12 ఎంఎన్‌సి కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఏదేని డిగ్రీ పూర్తి చేసిన అర్హులన్నారు. సర్టిఫికెట్స్‌తో బుధవారం ఉదయం 9 గంటలకు కళాశాలలో హాజరు కావాలన్నారు. వివరాలకు 91829 20381లో సంప్రదించాలన్నారు.

## వారపు సంత వేలం

**ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం**

మండలంలోని వేపులపర్తి గ్రామపంచాయతీలో సోమవారం ఎంపిడిఒ రంగనాయకులు ఆధ్వ ర్యంలో వారాంతపు సంత మార్కెట్ వేలం నిర్వహించారు. శ్రీలక్ష్మీరంగనాథస్వామి ఆలయానికి సంబం ధించిన వారపు సంతకు వేలం పాట నిర్వహించారు. వేపులపర్తి పంచాయతీలోని గోవిందయ్యదొడ్డి గ్రామానికి చెందిన జూగులయ్య గారి రామకృష్ణ అత్యధికంగా రూ. 43 వేలకు వేలం పాడి (7 నెలలకు) దక్కించుకున్నారు. వేలం పాటలో డిఎల్‌పిఒ నాగేశ్వరరావు, సర్పంచి రంగప్ప, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, విఆర్‌ఒ లక్ష్మణ్ణ, ప్రజలు పాల్గొన్నారు.

# మోసాలకు కేరాఫ్ చంద్రబాబు

- ఈ ప్రాంతాన్ని విస్మరించి కుప్పంకు నీరు తీసుకెళ్తారా..?
- వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత ధ్వజం

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్**

మోసాలకు కేరాఫ్ సిఎం చంద్రబాబు అని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. మోసాలను ప్రజలకు వివరించి కూటమి ప్రభుత్వం మెడలు వంచి హామీలు నెరవేర్చు కుందామని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామంలో సోమవారం ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' (బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ) కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అనంత వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ మాయమాటలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు, ఎన్నికల హామీలను విస్మరించిందన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఘోరంగా విఫలమైం దని, రాష్ట్ర ప్రజలకు తొలి ఏడాది రూ. 85 వేల కోట్లు బాకీ ఉందన్నారు. సుమారు 4.8 లక్షల మంది అర్హులైన పింఛన్లు తొలగించారన్నారు. 1.3 లక్షల వికలాంగుల పింఛన్లు తీసివేయడం దుర్మార్గం అన్నారు. ఈ ప్రాంతానికి నీరివ్వకుండా కుప్పంకు తీసుకెళ్లి చంకలు గుద్దుకుంటున్నా ఇక్కడి ఎంపి, ఎమ్మెల్యేలకు సిగ్గులేదా అని నిలదీశారు. నియోజకవర్గంలోని 114 చెరువులను నింపుతామని చెప్పిన ఎమ్మెల్యే సురేంద్రబాబు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. రంగయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే సురేంద్ర బాబుకు బిటిపిపై చిత్తశుద్ధి లేదన్నారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ మంగమ్మ, జడ్పీ ఛైర్మన్ గిరిజమ్మ, పార్టీ పరిశీలకులు నరేష్‌రెడ్డి, ఉమామహేశ్వరనాయుడు కూటమి ప్రభుత్వం అన్యాయాలు, దౌర్జన్యాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైసిపి రూపొందించిన క్యూఆర్ కోడ్ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బోయ తిప్పేస్వామి, సుధీర్, గోళ్ల సూరి, కిరీటియాదవ్, సుబ్బరాయుడు, గోపాల్, హనుమంతరాయుడు, కృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, లక్ష్మన్న, బిక్కి హరి, మల్లి, చంద్రశేఖర్, భీమేష్ పాల్గొన్నారు.

కూటమి మోసాలను వివరిస్తున్న వైసిపి నాయకులు

# యూరియాను అధిక మోతాదులో వాడొద్దు : కలెక్టర్

**ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్**

యూరియాను అధిక మోతాదులో వాడరాదని, దీనిని వాడేప్పుడు తగిన సూచనలు పాటించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత పథకం సౌజన్యంతో పంటల వారీగా సిఫార్సు చేసిన యూరియా మోతాదుకు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పంటలకు యూరియాను వాడేటప్పుడు అందులో నత్రజని వినియోగ సామర్థ్యాన్ని పెంచడానికి, వివిధ రూపాల ద్వారా జరిగే నష్టాన్ని తగ్గించడానికి వ్యవసాయ శాఖ తెలిపిన సూచనలు పాటించాలన్నారు. ప్రతి 5 కిలోల యూరియాకు 1 కిలో వేప పిండి కలిపి వాడితే నీటిలో కరిగే శాతం తగ్గి నత్రజని ఎక్కువకాలం పంటకు అందడమే గాక, వేపపిండి వల్ల చీడపీడల ఉధృతి కొంతవరకు తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని కలెక్టర్ డా॥వి.వినోద కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో 390 వినతులను ప్రజల నుంచి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డిఆర్‌ఒ ఎ.మలోల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



# రైతుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు, పండ్లతోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.శివారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో రైతుసంఘం అధ్యక్షులు వెంకటకొండ అధ్యక్షతన రైతుసంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం అనేక సంవత్సరాలుగా రైతుసంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా జాతీయ రహదారి 554.డి విస్తరణలో భాగంగా భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులకు 2013 చట్ట ప్రకారం పరిహారం ఇవ్వాలని పోరాడి సాధించామన్నారు. అలాగే 2023కు సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలని కరువు యాత్ర నిర్వహించామన్నారు. అలాగే రైతుల పంటలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నాలు నిర్వహించామన్నారు. అలాగే నిత్యం కరువుకు గురవుతూ పంటలు నష్టపోతున్న పరిస్థితుల్లో ఉద్యాన రైతులకు న్యాయం చేయాలని పోరాటం చేశామన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఆర్.కుళ్లాయప్ప, అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటకొండ, డి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా వి.శివారెడ్డి కె.నారాయణస్వామి, సహాయ కార్యదర్శులుగా సంజీవరెడ్డి, కెపి హనుమంతు, వరప్రసాద్, వేణు, తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుళ్లాయప్ప, రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యుడు రామక్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సేవలు ఎనలేనివి

కార్మికులను సన్మానిస్తున్న కమిషనర్ జబ్బార్‌మియా

**ప్రజాశక్తి-గుత్తి**

మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సేవలు ఎనలేనివని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, కమిషనర్ బి.జబ్బార్‌మియా కొనియాడారు. మున్సిపాలిటీ పరిధిలో జరిగిన వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమంలో ఉత్తమ సేవలందించిన మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక విగ్రహాల నిమజ్జన ప్రాంతాల్లో కార్మికులు పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు ఏర్పాటు పనులను సక్రమంగా నిర్వహించారన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా పుట్టినరోజును పురస్కరించుకుని కేకును కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇఇ హేమచంద్ర కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా, టిపిఎస్ మారుతీప్రసాద్, సర్వేయర్ దినేష్‌రెడ్డి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అప్పస్వామి, ఎఇలు గోవిందప్ప, హరికిరణ్, అకౌంటెంట్లు పల్లవి, పర్వీన్, ఆర్ఓ సతీష్ కుమారాచారి, ఆర్ఐలు నాగార్జున, ఫయాజ్, ఓబుళపతి, సతీష్, చంద్రకళ, పర్వీన్ బేగం, జలీనా, మురళి, హెల్త్ అసిస్టెంట్లు సుజాత, నెట్టికల్లు, కుళ్లాయప్ప, మెప్మా సిఒ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

ముఖ్యమంత్రి చంద్రబాబు మొట్టమొదటి సారిగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన 30 ఏళ్లు పూర్తి కావడంతో టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు 30ఏళ్ల క్రితం తొలిసారి సిఎంగా ఇదే రోజు బాధ్యతలు చేపట్టారన్నారు. ఈ మూడు దశాబ్దాల కాలంలో నాలుగు సార్లు సిఎంగా 30 అతి కీలకమైన పథకాలు, కార్యక్రమాలు, సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. అంతేగాకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో చంద్రబాబు పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్లు వేణుగోపాల్, హనుమంత్ చౌదరి, నాయకులు మంగళ ఆనంద్, వడ్డే సరళ, డీలర్ మల్లన్న, సింగంపల్లి ముత్యాలు, మురళీ, సాకే రామకృష్ణ, రామదాసు, వెంకటేశు, కురువ ఆజప్ప, సుజాత, ఆదెమ్మ, దాము, కురుబ మనోహర్, చాకలి రవి, మజ్జిగ అశోక్, బొమ్మయ్య, నరసింహప్ప, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# 'ఆవిష్కాంధ్ర-2025' కొత్త విప్లవానికి నాంది

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి

కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

**ప్రజాశక్తి-తాడిపత్రి**

రాష్ట్రంలో 'ఆవిష్కాంధ్ర-2025 కార్యక్రమంతో కొత్త విప్లవానికి నాంది పలికారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఆవిష్కాంధ్ర - ఒక కుటుంబం - ఒక ఎంట్రపిన్యూర్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఒక కుటుంబం.. ఒక ఎంట్ర పెన్యూర్ కార్యక్రమం ప్రతి కుటుంబాన్ని, యువతను ఆలోచించడానికి ప్రేరేపిస్తుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అన్నపూర్ణ మాట్లాడుతూ ఆవిష్కాంధ్ర నవకల్పనల ద్వారా ప్రపంచస్థాయిలో నిలిచే ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పడమే లక్ష్యమన్నారు. కావున ప్రతి విద్యార్థి, ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతి కుటుంబ అంటూ కలిసి నిర్మిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాసకులు జక్కా సత్యనారాయణ, విశ్వాసరావు, ఫిజికల్ డైరెక్టర్ జయలక్ష్మి, డాక్టర్ విజయభాస్కర్, పద్మనాభం, ఖాసిం వలి, ఓబుళపతి, విద్యార్థులు పాలొన్నారు.

# ఆయకట్టు రైతులు నీటి పన్ను చెల్లించాలి

**పెద్దవడుగూరు :** మండలంలోని హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు నీటి తీరువా పన్నులు చెల్లించి రసీదులు పొందాలని తహశీల్దార్ ఉషారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దవడుగూరుతోపాటు లక్షుంపల్లి, మిడుతూరు, కాశేపల్లి, చిన్నవడుగూరు, మేడిమాకులపల్లి, దిమ్మగుడి, చిట్టూరు గ్రామాల రైతులు ఆయా సచివాలయాల్లో నీటిపన్నులు చెల్లించాలని కోరారు.

# సరెండర్ అయినా రిలీవ్ కాని డిఇఇ..!

## తన బదిలీపై వివరణ ఇవ్వాలంటూ ఈఎన్‌సికి లేఖ-గతంలో డిప్యూటీ కమిషనర్ తరహాలో డిఇఇ వ్యవహార శైలి

**ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్**

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో డిఇఇ బదిలీ వ్యవహారం రచ్చకెక్కుతోంది. గతంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు స్థానంలో బదిలీపై వచ్చిన డిప్యూటీ కమిషనర్ పావనికి బాధ్యతలు అప్పగించకుండా పది రోజులకుపైగా కాలయాపన చేశారు. ప్రస్తుతం ఉద్యోగోన్నతిపై వచ్చిన డిఈఈ ప్రవంతికి ఎలక్ట్రికల్ విభాగ నిర్వహిస్తున్న సివిల్ ఇంజినీర్ దాక్షాయిని బాధ్యతలు అప్పగించకుండా కాలయాపన చేస్తున్నారన్న చర్చ ఉద్యోగ వర్గాల్లో నడుస్తోంది. దీనికి తగ్గట్టుగానే ఉద్యోగోన్నతి ఉత్తర్వులు ఇచ్చిన పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సికి తనని ఎందుకు సరెండర్ చేశారో చెప్పాలని డిఈఈ దాక్షాయిని లేఖ రాసినట్లు సమాచారం. సర్వీసు రూల్స్ ప్రకారం ఎలక్ట్రికల్ డీఈ పోస్టుకు అర్హత కలిగిన ప్రవంతి ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్న సివిల్ దాక్షాయిని ఇంజినీరింగ్ అధికార యంత్రాంగం ఈఎన్‌సికి సరెండర్ చేస్తూ లేఖ పంపినట్లు తెలుస్తోంది. పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ ఇన్‌చీఫ్ ఉత్తర్వుల మేరకు టిడ్కోలో పనిచేసే అసిస్టెంట్ ఇంజినీర్ ప్రవంతిని ఉద్యోగోన్నతిపై డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎలక్ట్రికల్‌గా అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో నియమిస్తూ పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ ఇన్‌చీఫ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో డీఈగా ప్రవంతి వారం రోజుల క్రితమే జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. ఎలక్ట్రికల్ డీఈగా కొనసాగుతున్న సివిల్ ఇంజినీర్ దాక్షాయిని ఈఎన్‌సికి సరెండర్ చేస్తూ కార్పొరేషన్ అధికార యంత్రాంగం ఈఎన్‌సికి లేఖ పంపారు. సరెండర్ అయిన డిఇఇ దాక్షాయిని రూల్ పొజిషన్‌కు వ్యతిరేకంగా తనని ఎందుకు సరెండర్ చేశారో వివరణ ఇవ్వాలని పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సికి ఉత్తరం రాశారు. తనకు వివరణ వచ్చేవరకు విధుల నుంచి వెళ్లేది లేదంటూ తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో ఉద్యోగోన్నతిపై డీఈగా వచ్చిన ప్రవంతి విధుల్లో చేరటానికి అటంకాలు మొదలయ్యాయి. బాధ్యతలు అప్పగించకపోవడంతో ఆమె రోజూ కార్యాలయానికి వచ్చి వెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో నెలకొన్న ఈ సందిగ్ధ పరిస్థితిని చక్కదిద్ది ఉద్యోగోన్నతిపై వచ్చిన వారికి సీటు కేటాయించేలా చూడాలని ఉద్యోగ వర్గాల నుంచి అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# రాబోయే తరాలకు 'బాబు' స్ఫూర్తిదాయకం

## మంత్రులు టిజి.భరత్, పయ్యావుల కేశవ్-చంద్రబాబు సిఎం అయ్యి 30ఏళ్లు అయిన సందర్భంగా సంబరాలు

కేక్ కోస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

**ప్రజాశక్తి-అనంతపురం**

ఒక ముఖ్యమంత్రి ఎలా ఉండాలన్నది రాబోయే తరాలకు సిఎం చంద్రబాబు స్ఫూర్తిగా నిలుస్తారని ఇన్‌ఛార్జి మంత్రి టిజి భరత్, జిల్లా మంత్రులు పయ్యావుల కేశవ్, సమితమ్మ అన్నారు. మొట్ట మొదటిసారిగా సిఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసి 30ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా కేక్ కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 75 ఏళ్ల వయసులో కూడా ఒక యువకుడిలా రాష్ట్రం కోసం శ్రమిస్తున్న నాయకుడు చంద్రబాబు అన్నారు. ప్రజల వద్దకే పాలన మొదలుకొని ఎన్నో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన ఆద్యుడు చంద్రబాబు అన్నారు. సాంకేతిక విజ్ఞానాన్ని పేదింట విద్యార్థులు అభ్యసించే విధంగా చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. మూడు దశాబ్దాల రాజకీయ ప్రయాణంలో ఏపీని అభివద్ధి పథంలో నడిపించారన్నారు. సంక్షోభాలను సమర్ధవంతంగా ఎదుర్కొంటూ.. ముఖ్యమంత్రిగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఉమ్మడి అనంతపురం జిల్లా అబ్జర్వర్ కోవెలమూడి నాని, టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, గుమ్మనూరు జయరామ్, కందికుంట ప్రసాద్, దగ్గుపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

**యాడికి :** గ్రామాల్లోని ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తాడిపత్రి మలేరియా నివారణ సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు కోరారు. సోమవారం మండల పరిధిలోని రాయల చెరువు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరాజ్ డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో లక్షుంపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే తప్పక పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం ఇళ్లలో నీటి తొట్లను శుభ్రం చేసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికీ రక్త పూతలు తీసి రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయలచెరువు మేల్ సూపర్‌వైజర్ షబ్బీర్‌అహ్మద్, మేల్ హెల్త్ అసిస్టెంట్ మైనుద్దీన్, ఎఎన్ఎం, ఆశా బాల కుళ్లాయమ్మ, పాల్గొన్నారు.

# 'కూచిపూడి'లో చిన్నారుల ప్రతిభ

**పామిడి :** కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కూచిపూడి భరత నాట్యంలో పామిడి విద్యార్థులు ప్రతిభ చూపారు. పామిడిలోని ప్రయివేటు పాఠశాలలో చదువుతున్న పర్ణిత, నీహాస్వి, శ్రీస్నిగ్ధ రాయల్, సహస్ర, నాగ సాన్విక, సాయివర్ష, దివ్యశ్రీ, షణ్ముఖ, ప్రియా కలిసి నృ్య సురేష్ మాస్టర్ నేతృత్వంలో కూచిపూడి నాట్యం చేశారు. దీంతో ఆలయ కమిటీ నిర్వాహకులు చిన్నారులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

ప్రశంసాపత్రాలతో చిన్నారులు

# ఎఆర్‌టి, సరోగసీ సెంటర్లు నిబంధనలు పాటించాలి

**అనంతపురం :** జిల్లాలోని అన్ని ఎఆర్‌టి, సరోగసీ సెంటర్ల నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఇబి దేవి సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. కేవలం అర్హులైన నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే ఐవిఎఫ్, ఐసిఐఎస్ వంటి చికిత్సలు చేయాలన్నారు. రోగుల నుంచి అవగాహనతో కూడిన సమ్మతి పొందాలన్నారు. గుడ్డు, వీర్యం, భ్రూణాల విక్రయం పూర్తిగా నిషేధమన్నారు. కేవలం పరోపకార సరోగసీకి మాత్రమే అనుమతి ఉందన్నారు. వాణిజ్య సరోగసీ, బ్రోకర్లు పూర్తిగా నిషేధమన్నారు. సరోగేట్ తల్లుల ఆరోగ్యం, గౌరవం, హక్కులను కాపాడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# నల్లబ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగుల నిరసన

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

**అనంతపురం :** విజయవాడలో జరుగుతున్న సిపిఎస్ వద్దు ఓపిఎస్ కావాలని చేపట్టిన నిరసన ప్రదర్శనకు మద్దతుగా జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక తరపున అనంతపురంలో సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నిరసనలో సచివాలయ ఉద్యోగ జెఎసి నేతలు డి.సుధాకర్, వి.లక్ష్మీనారాయణ, శివశంకర్, వీరనారప్ప, మల్లికార్జున, సిరాల చంద్ర, రామకృష్ణ, మంజునాథ్, జానకి రమేష్, మారుతీప్రసాద్, పర్వతరెడ్డి, తులసీరామ్, హారతి, సావిత్రీబాయి, రెహానా, జబీనా, సమీనా, కృష్ణారెడ్డి, సందీప్, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో చంద్రబాబు విఫలం

**పుట్లూరు :** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో సిఎం చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్ విమర్శించారు. వైసిపి మండల అధ్యక్షులు పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సోమవారం 'రీకాలింగ్ చంద్రబాబు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైఎస్ఆర్ విగ్రహం నుంచి అంబేద్కర్ కాలనీ వరకూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్కెయులో 'స్వచ్ఛత సేవ'

శ్రమదానంలో పాల్గొన్న విద్యార్థులు

**అనంతపురం :** శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం ఔషధ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల వద్ద ఉన్న మెడిసినల్ గార్డెన్‌లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి.సోమశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులతో ఇలాంటి స్వచ్ఛత పనులు చేయించడం వల్ల శుభ్రతపై అవగాహన ఏర్పడుతుందన్నారు.

# ఎల్ఐసి వార్షికోత్సవం

**అనంతపురం :** నగరంలోని ఎల్ఐసి కార్యాలయంలో 69వ ఎల్ఐసి వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ భరత్ అధ్యక్షతన జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి సంఘం నాయకులు ఆదిశేషయ్య, చెరుకుతోట జగదీష్, స్టాఫ్ యూనియన్ బృందం ఎ.వెంకటేష్, రతన్‌లాల్, సురేష్, రొద్దం హరి, సూరి, మహేష్, బాబా ఫక్రుద్దీన్, రామకృష్ణ, పద్మ, జీవనజ్యోతి, నరసమ్మ, క్రిస్టినియా, వలి, నారాయణస్వామి, విరూపాక్షి, రామ మూని, ప్రకాష్, సీనా, బాషా, ఆదినారాయణ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# క్షతగాత్రుడికి ఆర్థికసాయం

**పుట్లూరు :** వినాయక నిమజ్జనం సందర్భంగా మండల పరిధిలోని కుమ్మనమలలో కాలు విరిగి హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌కు ఎంపిపి భూమిరెడ్డి రాఘవరెడ్డి సోమవారం ఆర్థికసాయం అందించారు. ఇందులో భాగంగా ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. అనంతరం మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. పరామర్శించిన వారిలో రంగరాజుకుంట సర్పంచు రామంజలరెడ్డి, తక్కల్లపల్లి సర్పంచు మహేశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

# నేత్రదానం

**నార్పల :** తన తండ్రి నేత్రాలను దానం చేసిన ఓ కుమారుడు పలువురికి ఆదర్శంగా నిలిచాడు. వివరాల్లోకి వెళ్తే.. నార్పలలోని గవ్వలవీధికి చెందిన శ్రీరాములు అలియాస్ బబ్రూ అనారోగ్యంతో కన్నుమూశారు. దీంతో ఆయన కుమారుడు రాజేష్ ఆలోచించి తన తండ్రి నేత్రాలను దానం చేయడానికి ముందుకొచ్చాడు. అనంతరం నేత్రాలను అనంతపురంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారికి అందించారు. మరణానంతర నేత్రదానానికి ముందుకొచ్చేవారు సెల్ 94408 39043, 94933 43964 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# రేపు ఉచిత సంతాన సాఫల్యత శిబిరం

**గుత్తి :** పట్టణంలోని తురకపల్లి రోడ్డులో ఉన్న వర్షిణి క్లినిక్‌లో బుధవారం ఉచిత సంతాన సాఫల్యత శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎన్ఎల్.శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురానికి చెందిన జన్మిత ఆసుపత్రి వైద్యనిపుణులు డాక్టర్ పి.భారతి హాజరై దంపతులకు వైద్య పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సంతానం లేని దంపతులు, పీసీఓడీ, ఫాలోపియన్ ట్యూబ్స్ మూసుకుపోయిన వారికి, అలాగే నెలసరి సక్రమంగా లేనివారు, హార్మోన్ లోపం థైరాయిడ్ లాంటి సమస్యల పరిష్కారం కోసం శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్ 81214 49988 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

# పంటకోత ప్రయోగాలు

**బెలుగుప్ప :** మండలంలో పకడ్బందీగా పంటకోత ప్రయోగాలు చేపట్టాలని తహశీల్దార్ అనిల్‌కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎఎస్ఓ మమత పంటకోత ప్రయోగాల ప్రాముఖ్యత, నిర్వహించే పద్ధతులను వివరించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి పృథ్వీసాగర్ మాట్లాడుతూ పంట నమోదు ప్రక్రియను ఈనెల 30వతేదీలోపు పూర్తి చేయాలన్నారు. పంట నమోదుపై ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్‌కు గాంధీ చిత్రపటం బహూకరణ

**గుత్తి :** గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ పెయింటింగ్ చిత్రపటాన్ని కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు సోమవారం బహూకరించారు. చీరాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు రవి గీసిన గాంధీ అపురూప చిత్రపటాన్ని, అలాగే గుత్తి కోట పరిపాలకులు మురారి రావ్ గోర్పడే వంశస్థులు ఇంద్రజిత్తు గోర్పడే ముద్రించిన ప్రముఖ నవల, రచయిత్రి రీటా రామ్మూర్తి గుప్తా గుత్తి కోట పాలించిన వంశస్తులపై రాసిన పుస్తకాన్ని గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు చౌదరి కలెక్టర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక సాంస్కృతిక అధికారి జయ కుమార్, సమితి గౌరవ సలహాదారు యు.బాలమురళీకృష్ణ, సాధు శేఖర్,సూర్యనారాయణ రెడ్డి, సభ్యులు రంగస్వామి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవకులకు సన్మానం

**యాడికి :** మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్య, ఆరోగ్య, సామాజిక సేవలు అందిస్తున్న వారిని రాయల ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా వారి సేవలను గుర్తించిన అమెరికాలు ఉన్న ట్రస్టు ఫౌండర్ పసల శ్రీధర్ ఆదేశాల మేరకు ఫీజికల్ డైరెక్టర్ సంజీవరాయుడు, యోగా శిక్షకుడు గరిడి శివన్న, మే ఐ హెల్ప్ యూ ప్రెసిడెంట్ బండారు బాలకృష్ణ, ధ్రువ నారాయణ, వృద్ధాశ్రమం నిర్వాహకుడు వెంకట రాముడు, గతంలో చందన హైస్కూల్‌లో పని చేసిన సంజీవరాయుడును సన్మానించారు. అనంతరం రూ.10వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతా రామాంజనేయులు, ఎంఇఒ కాశప్ప, ట్రస్టు ఛైర్మన్ శ్రీనివాసులు, శశిధర్, ఆనంద్, బండారు బాల, గ్రామపెద్దలు శ్రీనివాసుల యాదవ్, రవికుమార్, నాగన్న, మంజులవాణి, శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణం తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న తహశీల్దార్ రాము

**యల్లనూరు :** మండల కేంద్రం లోని పుడమి అగ్రి మార్ట్ ఎరువుల దుకాణాన్ని తహశీల్దార్ బి.రాము, వ్యవసాయ అధికారి మధు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా నిల్వ చేసినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనికితోడు ప్రతిరైతుకూ ఎరువులు కొన్న తర్వాత రసీదులు అందజేయాలన్నారు.

# పింఛన్లతో ఆర్థిక భరోసా

## ఆందోళన వద్దు..అర్హులందరికీ పింఛన్లు - పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు

పింఛన్లు పంపిణీ చేస్తున్న గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

**ప్రజాశక్తి-గుంతకల్లు**

ప్రభుత్వం అందజేస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లతో పేదల కుటుంబాల్లో ఆర్థిక భరోసా నింపుతోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. సోమవారం స్థానిక పాత గుంతకల్లులో నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి హయాంలో సదరం క్యాంపుల్లో దళారుల అండతో అనర్హులు పింఛన్లు పొందారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అలాంటి పింఛన్లపై ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం మరలా సదరం క్యాంపులు నిర్వహించి ఇతర జిల్లాల వైద్యులతో పున:పరిశీలన చేయించి అర్హులందరికీ పింఛన్లు అందజేస్తామన్నారు. ఈ విషయంపై వికలాంగులు ఎలాంటి ఆందోళనలు చెందవద్దన్నారు. దీన్ని ఆసరాగా తీసుకుని ప్రతిపక్షాల నాయకులు వికలాంగులు, వృద్ధాప్య పింఛన్లు తొలగించారని ప్రభుత్వంపై బురద చల్లుతున్నారన్నారు. అయితే సిఎం చంద్రబాబు నోటీసులు వచ్చిన వారితో పాటు అందరికీ ఈనెల పింఛన్లు పునరుద్ధరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్, టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి, డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

**శింగనమల :** వికలాంగులు ఎవరూ ఆందోళన చెందవద్దని అర్హులందరికీ పింఛన్లు వస్తాయని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని గుమ్మేపల్లి గ్రామంలో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోనే పింఛన్ పథకానికి ఆద్యులు టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అన్నారు. ఆయన తర్వాత రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2వేలు,, తర్వాత రూ.3వేలు, రూ.4వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కిందన్నారు. అనంతరం సోలార్ విద్యుత్‌తో విద్యుత్ సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం లభించనుందన్నారు. ఇందులో భాగంగానే ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద జిల్లాలోనే మొట్టమొదటి ఆదర్శ గ్రామంగా గుమ్మేపల్లిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామానికి రూ.కోటి మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా గ్రామ పంచాయతీలోని అన్ని ఇళ్లు, వీధిదీపాలు, ప్రభుత్వ కార్యాలయాలు, రాబోయే రోజుల్లో వ్యవసాయం కోసం ఉపయోగించే విద్యుత్ మోటార్లకు కూడా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భాస్కర్, సింగిల్‌విండో ప్రెసిడెంట్ గుర్రం లక్ష్మీనారాయణ, సర్పంచులు డేగల లలితమ్మ, రమేష్, టిడిపి సీనియర్ నాయకులు డేగల కృష్ణమూర్తి, మారుతీనాయుడు, డేగల శ్రీనివాసులు, సుదర్శన్, కల్లుమడి ఓబిరెడ్డి, శింగనమల చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ జి.సత్యనారాయణ, మాసుల్ చంద్రమోహన్, పెద్దమట్లగొంది అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

**అనంతపురం కలెక్టరేట్ :** ఐదేళ్లపాటు అరాచరికపు పాలన సాగించిన జగన్‌రెడ్డి రుషికొండపై ప్రజల సొమ్ముతో రూ.500కోట్లతో ప్యాలెస్ నిర్మించుకున్నాడని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శించారు. సోమవారం అనంతపురంలోని పలుప్రాంతాల్లో టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, కమిషనర్ బాలస్వామితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం 9, 31వ డివిజన్‌తోపాటు రుద్రంపేట పంచాయతీ చంద్రబాబు నగర్‌లో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్ల పంపిణీపై అన్నిచోట్ల హర్షం వ్యక్తమవుతోందన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోనే 12.72 కోట్ల రూపాయల పింఛన్లు అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 125 కోట్ల రూపాయల మేర పింఛన్లు ఇస్తున్నట్లు చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 5 కీలక హామీలు నెరవేర్చామన్నారు. పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ, అన్న క్యాంటీన్లు, ల్యాండ్ యాక్ట్ రద్దు వంటివి చేశామన్నారు.

కాగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో అనంతపురంలో ఏర్పాటు చేసిన 108 వాహనాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, సహచర ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

వృద్ధుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

# నేరాలు ఘోరాలు

## మహిళ ఆత్మహత్యాయత్నం

**పుట్లూరు :** భూమికోసం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం మండల పరిధిలోని చిన్న మల్లేపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. చిన్న మల్లేపల్లి గ్రామానికి చెందిన సావిత్రమ్మ 30 సంవత్సరాల నుంచి భూమి సాగు చేసుకుంటుండగా ఈ మధ్యకాలంలో మరొకరు తమ భూమి అంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం పొలంలోకి వచ్చి ఆ వ్యక్తి సేద్యం చేస్తుండగా చేయొద్దని అడ్డుపడింది. అయినా వినకపోవడంతో మనస్థాపం చెంది పురుగుల ముందు తాగింది. వెంటనే సావిత్రమ్మను కుమారుడు 108 ద్వారా చేయగా తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## నిందితుడు అరెస్టు

**నార్పల :** గతనెల 30వ తేదీ శనివారం మండల పరిధిలోని వెంకటాంపల్లి మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు వెంకటాంపల్లి గ్రామంలో షేక్ జమీలను అదే గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి గొడ్డలితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకుని జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.